కియోస్క్‌లకు గ్రహణం

- రైతు సేవా కేంద్రాలను నిర్వీర్యం చేసే కుట్ర
- మూలన పడిన కియోస్క్ యంత్రాలు
- రైతులకు అందని సేవలు, సమాచారం
- తప్పని అవస్థలు

బండిఆత్మకూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఉపయోగపడే సేవలను అటకెక్కించింది. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసే దిశగా అడుగులువేస్తోంది. అధికారంలోకి రాగానే ఆర్భాటంగా రైతు భరోసా కేంద్రాల పేరును రైతు సేవా కేంద్రాలుగా మార్చినా సేవలను మాత్రం గాలికి వదిలేసింది. దీంతో రైతు సంక్షేమమే ధ్యేయంగా వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి ప్రారంభించిన రైతు భరోసా కేంద్రాల లక్ష్యం నీరుగారిపోయింది.

రైతులకు ప్రయోజనకరం

రైతుల ముగిటకు వ్యవసాయ శాఖ సేవలను, సాంకేతిక, శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్బీకేలు ప్రారంభించింది. ప్రతి ఆర్బీకేలోనూ రైతులకు అవసరమైన సమాచారం అందించడానికి కియోస్కులు ఏర్పాటు చేసింది. నాలుగేళ్ల పాటు విస్తృతంగా సేవలందించిన కియోస్క్‌లు ప్రభుత్వం మారడంతో మూలకు చేరాయి. రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, నాణ్యమైన విత్తనాలు స్థానికంగానే ఎలాంటి కష్టాలు లేకుండా అందించడానికి వీటిని ఏర్పాటు చేసింది. వీటి సహాయంతో సాంకేతికంగా రైతులకు అవగాహన కల్పించడానికి ఎంతగానో ఉపయోగపడేవి. కానీ, నేడు రైతుసేవా కేంద్రాల ద్వారా ఎరువులు, పురుగు మందులు వంటివి అందించడం కూటమి ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో వీటి ఉపయోగం లేకుండా పోవడంతో మూలకు చేరాయి.

సేవలకు దూరం

రైతులకు అవసరమయ్యే ఎరువులు, పురుగు మందుల ధరలు, రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ ధరలు, సమీపంలోని మార్కెట్ ధరలు కియోస్క్ ద్వారా రైతులకు తెలిసేవి. దీంతో పాటు వాతావరణ సమాచారం. మార్పులు, సీజనల్ పంటల వివరాలు, లాభిసాటి సాగు అవసరమైన సూచనలు కూడా అందేవి. కియోస్క్‌లను వినియోగించుకునేందుకు రైతులు కూడా ఆసక్తి చూపేవారు.

కోట్లాది రూపాయలు వృథా

బండి ఆత్మకూరు మండలంలో ఉన్న 15 రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్‌లను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటిలో ఒక్కో కేంద్రంలో ఒక్కో కియోస్క్ కోసం రూ.లక్షలు ఖర్చు చేసింది. ప్రస్తుతం వీటిని మూలకు చేర్చి కోట్లాది రూపాయలు కూటమి ప్రభుత్వం వృథా చేస్తుందని పలువురు మండిపడుతున్నారు. ఎన్నో ఉపయోగాలున్న కియోస్క్‌ల సేవలను పునరుద్ధరించాలంటూ పలువురు డిమాండ్ చేస్తున్నారు.



సింగవరం రైతు సేవా కేంద్రంలో మూలన పడిన కియోస్క్ మిషన్

రైతులకు ఎంతో ఉపయోగకరం



గత ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాల్లోని కియోస్కులతో రైతులకు మేలు జరిగేది. ఎప్పటికప్పుడు సాంకేతికంగా సలహాలు అందించడంతో పాటు, ఎరువులు, పురుగు మందుల ధరలతో బ్లాక్ మార్కెట్‌ను నిలువరించేవారు. నేడు వాటిని మూలకు చేర్చడం వలన రైతులకు తీవ్ర నష్టం కలుగుతోంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కియోస్క్‌లను తిరిగి అందుబాటులోకి తీసుకురావాలి.

– డి. రత్నమయ్య, రైతు ఏ.కోదూరు గ్రామం

క్లుప్తంగా

సర్వేలు వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

నందికొట్కూరు: అన్ని రకాల సర్వేలను వేగవంతం చేయాలని, సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. మండల పరిధిలోని బిజినవేముల పంచాయతీ కార్యాలయంలో సర్వేలపై ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. ఎంఎస్ఎంఈ, ఎన్‌పీసీఐ, హౌస్‌హోల్డ్ సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సర్వేలపై నిర్లక్ష్యం వహిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఎంపీపీ ఉర్దూ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

ఆత్మకూరు: ఆత్మకూరు మండల పీఆర్‌టీయూ మండల కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్‌ఇబ్రహీం ఎన్నికల అధికారిగానూ, పి.నూర్ మహమ్మద్ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. మండల కార్యవర్గ అధ్యక్షుడిగా సి.ప్రదీప్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా జి.హనుమంతు, అసోసియేట్ అధ్యక్షుడిగా షేక్‌మన్సూర్‌హుసేన్, ఉపాధ్యక్షుడు కె.రమణయ్య, మహిళా ఉపాధ్యక్షురాళ్లుగా ఎన్.శోభ, కార్యదర్శులుగా సయ్యద్ రియాజూర్ రహిమాన్, ఆర్.మల్లీశ్వరి, మహిళా కార్యదర్శిగా పి.సురేఖ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

ఆత్మకూరు: మండలంలోని సిద్ధాపురం అటవీ ప్రాంతంలోని అలుగు, పెద్దొప్పి, గుండమడుగు ప్రాంతాల్లోని నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఆత్మకూరు ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ దాడుల్లో 2,200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఎవరైనా అక్రమంగా నాటుసారా తయారు చేస్తున్నట్లు తెలిస్తే 94409 02585, 91772 99067, 83283 07774 నంబర్లకు సమాచారం అందించాలన్నారు.

శ్రీశైలంలో నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని శ్రీకృష్ణ యాదవ అన్నసత్రం ప్రాంగణంలో ఆదివారం స్థానికులు, భక్తుల సౌకర్యార్థం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పిన్నిక లక్ష్మీ ప్రసాద్ యాదవ్, నాగార్జున ప్రసాద్ యాదవ్ శనివారం తెలిపారు. శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ దరశి రామకృష్ణ దంపతులతో పాటు డాక్టర్లు ఊర్మిళ యాదవ్, సంజీవ్ దంపతులు, సీతారామిరెడ్డి, దస్తగిరి, సాయి కృష్ణ యాదవ్, కిరణ్ తదితర 15 మంది డాక్టర్ల బృందం ఉచిత వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు. కనిగిరి ఏలికా హరిబాబు యాదవ ఆధ్వర్యంలో ఉచిత రక్త పరీక్ష కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పుట్టుకతో మూగలకు ప్రత్యేక వైద్య చికిత్సలు, సలహాలను వైద్యనిపుణులు అందజేస్తారని తెలిపారు.

సేవాభావం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న అసోసియేట్ డీన్ వీర జయలక్ష్మి

మహానంది: విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వీర జయలక్ష్మి సూచించారు. వ్యవసాయ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడినవారవుతారన్నారు. వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దుల లక్ష్మీదేవి, ఓఎస్ఏ ఎల్.వి జయ భాస్కర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆదర్శ రైతు మాబు ఉసేని, తదితరులు పాల్గొన్నారు.

పొలాలకు రస్తా చూపండి



మాట్లాడుతున్న వరాల మాలిక్

ఆత్మకూరు: పట్టణ పొలిమేరలో పొలాలకు వెళ్లేందుకు దారి చూపాలని రైతు సంఘం నాయకుడు వరలా మాలిక్ తహసీల్దార్ రత్నరాధికను కోరారు. శనివారం ఆయన రైతులతో కలిసి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. వరలాల మాలిక్ మాట్లాడుతూ పట్టణ పొలిమేరలో పొలాలకు వెళ్లడానికి 24 అడుగుల రోడ్డు ఉందని, కానీ కొందరు రైతులు రోడ్డును ఆక్రమించి సాగు చేసుకున్నారన్నారు.

నేడు నాగేశ్వరస్వామికి పూజలు

పగిడ్యాల: కార్తీక మాసం చివరిరోజును పురస్కరించుకొని తూర్పుప్రాతకోట గ్రామంలోని నాగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం లక్షబిల్వార్చన పూజ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు చిలుకల శంకర్‌రెడ్డి శనివారం తెలిపారు. భక్తులకు కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే నాగేశ్వరస్వామి నూతన రథశాల నిర్మించిన తాపీవర్కర్లకు, కరోనా సమయంలో గ్రామంలో వైద్యసేవలు అందించిన వైద్యులు, వైద్యసిబ్బందికి సన్మాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

బండిఆత్మకూరు : మండలంలోని ఓంకారేశ్వరాలయంలో ఆదివారం కార్తీక మాసం ముగింపు సందర్భంగా హుండీ కానుల లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ నాగప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ర్యాగింగ్ జోలికెళ్లొద్దు

నంద్యాల(న్యూటౌన్): జూనియర్ విద్యార్థులను సీనియర్లు ర్యాగింగ్ చేయడం సరికాదని మహిళా పోలీసు స్టేషన్ ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. స్థానిక ఆర్‌జీఎం ఇంజినీరింగ్, నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ క్రైమ్, ర్యాగింగ్, మహిళలపై జరిగే నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారత అనేది సమాన హక్కులు కల్పించడమన్నారు. ర్యాగింగ్‌తో విద్యార్థుల జీవితాలు నాశనమవుతాయన్నారు.

హెచ్‌ఐవీ రహిత సమాజమే ధ్యేయం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, వైద్య సిబ్బంది



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, వైద్య సిబ్బంది



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

కొత్తపల్లి: హెచ్‌ఐవీ రహిత సమాజ స్థాపనే ధ్యేయంగా అందరం ప్రజలను చైతన్య పరచాలని వైద్యాధికారి దీపానాగవేణి పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రం కొత్తపల్లిలో విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెరిబా స్వచ్ఛంద సేవా సంస్థ ఓఆర్‌డబ్ల్యూ లక్ష్మీనరసమ్మ ఆధ్వర్యంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నుంచి గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్‌ఐవీ అంటువ్యాధి కాదని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కొత్తపల్లి వైద్యుడు మహమ్మద్ భేగ్, విద్యార్థులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: హెచ్‌ఐవీపై ప్రతిఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ నాగలక్ష్మి అన్నారు. హెచ్‌ఐవీ/ఎయిడ్స్ డే సందర్భంగా మండల కేంద్రం పాములపాడులో ఏఎన్ఆర్‌జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ర్యాలీ చేశారు. బస్టాండ్ సెంటరులో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాధి ప్రాణాంతకమైనదని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో డాక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం గోపాల్, వైద్య సిబ్బంది, ఐఈఆర్‌టీలు, ఆశా కార్యకర్తలు, మెరిబా సంస్థ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు కలిసి మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. స్థానిక మెరీబా సొసైటీకి చెందిన జుల్‌ఫికర్ వ్యాధి గురించి వివరించారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం నంద్యాల జిల్లాలోని ఆత్మకూరును రెడ్ జోన్‌గా గుర్తించారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కార్తీకమాస ఉత్సవాలు



మహానందిలో మహాపూర్ణాహుతి పూజలు

మహానంది: మహానంది దేవస్థానంలో కార్తీకమాస ఉత్సవాలు శనివారం ముగిశాయి. స్థానిక యాగశాలలో మహాపూర్ణాహుతి పూజలతో ఉత్సవాలు ముగియగా రాత్రి అభిషేకం మండపంలో శాంతి కల్యాణోత్సవం కమణీయంగా సాగింది. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, ఆంజనేయశర్మ, హనుమంతుశర్మ, ఋత్వికులు, పండితులు పూజలు చేపట్టారు.

కామేశ్వరీదేవికి లక్ష కుంకుమార్చన

కార్తీకమాసం, అమావాస్యను పురస్కరించుకుని మహానందిలోని శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలు వైభవంగా జరిగాయి. నంద్యాలకు చెందిన రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి, విజయకుమారి దంపతుల సహకారంతో వరుసగా 40వ ఏడాది లక్ష కుంకుమార్చన పూజలు జరిగాయి.

భక్తజనసందడి

కార్తీకమాసం, అమావాస్య, వీకెండ్ సందర్భంగా మహానంది ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. వేలాది మంది భక్తుల రాకతో ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి. ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది.

జగనన్న కాలనీలపై విచారణ



లింగాల గ్రామంలో జగనన్న కాలనీలో విచారణ చేస్తున్న విజిలెన్స్ అధికారి సిద్దయ్య

పాములపాడు: మండలంలోని వేంపెంట, ఇస్కాల, లింగాల గ్రామాల్లో జగనన్న కాలనీలపై విజిలెన్స్ అధికారులు శనివారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారి ఏజీ సిద్దయ్య మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం ప్రజలకు ఇంటి స్థలాలు పంపిణీ చేసిందన్నారు. ప్రభుత్వ స్థలం లేని గ్రామాల్లో ప్రభుత్వమే రైతుల నుంచి కొనుగోలు చేసి ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ మేరకు ప్రభుత్వం రైతులకు డబ్బును మంజూరు చేసిందని, అయితే అధికారులు, రాజకీయ నాయకులు కమీషన్లు తీసుకున్నారా లేదా అనే విషయంపై విచారణ చేశారు. ఎక్కడా కమీషన్లు తీసుకోలేదని యజమానులు తెలిపారు. ఈ విషయాలనుల ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్తామని ఆయన చెప్పారు. ఆయన వెంట ఆయా గ్రామాల వీఆర్వోలు, భూయజమానులు ఉన్నారు.

సర్వేలు త్వరితగతిన పూర్తి చేయాలి



యర్రగూడూరులో సచివాలయ సిబ్బంది హాజరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు : గ్రామాల్లో చేపట్టిన సర్వేలు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని రుద్రవరం, యర్రగూడూరు గ్రామాల్లోని సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది హాజరును పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఎన్‌పీసీఐ అకౌంటింగ్, హౌస్ హోల్డ్స్ జియోట్యాగింగ్ సర్వేలు వేగవంతం చేయాలన్నారు. అలాగే తుమ్మలూరు గ్రామంలో పింఛన్ పంపిణీని పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్ వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

బర్త్ సర్టిఫికెట్ల బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలి

వెలుగోడు : అపార్ నమోదు కోసం బర్త్ సర్టిఫికెట్ తీసుకునేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం బాధ్యత తీసుకొని సచివాలయాల ద్వారా సర్టిఫికెట్లు అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఆర్.నాయక్ కోరారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని లేట్ బర్త్ సర్టిఫికెట్లను సచివాలయాల ద్వారా ఎంక్వైరీ చేయించి అందించాలన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి సైపులా, నాయకులు వరుణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

మిడుతూరు: మండలంలో శనివారం 93 శాతం పింఛన్ పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ దశరథరామయ్య తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీకార్యదర్శి శ్రీధర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పింఛన్ ఇప్పించి పుణ్యం కట్టుకోండి సారూ..

- ఎమ్మెల్యేను వేడుకున్న మానసిక దివ్యాంగురాలు

జూపాడుబంగ్లా: మండల కేంద్రం జూపాడుబంగ్లాలో శనివారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే జయసూర్య హాజరయ్యారు. ఈ నేపథ్యంలో తనకు పింఛన్ మంజూరు చేయించి పుణ్యం కట్టుకోండి సారూ అంటూ సుకన్య అనే శారీరక, మానసిక దివ్యాంగురాలు వేడుకుంది. అయితే పక్కన్నే ఉన్న ఓ టీడీపీ నాయకుడు ఎంత మంది ఎమ్మెల్యేలు వచ్చినా పింఛన్ ఇప్పించరంటూ కామెంట్ చేయడంతో అందరూ అవాక్కయ్యారు. వెంటనే కల్పించుకొన్న ఎమ్మెల్యే పింఛన్ వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. మండలంలో 95శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు.

యువకుడి అదృశ్యం

మహానంది: మహానంది మండలం అబ్బీపురం గ్రామానికి చెందిన షేక్ అజీజ్ గత మూడు రోజుల నుంచి కనిపించడం లేదని తండ్రి షేక్ మహబూబ్ హుసేన్ ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం రాత్రి ఆయన మాట్లాడుతూ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వరిగడ్డి దగ్ధం



మిడుతూరు: విద్యుత్ తీగల షార్ట్ సర్క్యూట్‌తో శనివారం ట్రాక్టర్ వరిగడ్డి దగ్ధమైంది. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బండిఆత్మకూరు మండలం మోతుకూరు గ్రామానికి చెందిన ఓ రైతు అమ్మకానికి ట్రాక్టర్ వరిగడ్డి తీసుకురాగా పీరుసాహెబ్ పేట గ్రామానికి చెందిన శాలుమియ్య కొనుగోలు చేశాడు. ఈ మేరకు కలంలో వరిడ్డిని వదిలేందుకు వెళ్తుండగా ఇళ్ల మధ్యలోని విద్యుత్ తీగెలు వరిగడ్డికి తగిలి మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన ట్రాక్టర్ డ్రైవర్ ఇళ్ల మధ్యలో నుంచి కల్లం వైపుతీసుకెళ్లి ట్రాక్టర్ లిఫ్ట్ ఎత్తి వరిగడ్డిని వదిలేశాడు. గ్రామస్తులు మంటలు ఆర్పేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

కార్తీక బహుళ అమావాస్య పూజలు



కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



ఆత్మకూరు శివాలయంలో ఓంకారాలతో దీపాలు వెలిగించిన దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని సంగమేశ్వరం వద్ద ఎగువ పుష్కరఘాట్ వద్ద ఉమామహేశ్వరాలయంలో శనివారం ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ రోజు కార్తీక బహుళ అమావాస్య పూజలు నిర్వహించారు. భక్తులు శివలింగానికి కృష్ణాజలాలతో అభిషేకాలు చేశారు. అదేవిధంగా లలితాదేవి అమ్మవారికి భక్తులు రుద్రాభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన, మంగళహారతి వంటి విశేష పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు కూష్మాండ దీపోత్సవం, గుమ్మడికాయ దీపోత్సవం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు: పట్టణంలోని శివాలయాల్లో శనివారం రాత్రి మహిళలు పెద్ద సంఖ్యలో కార్తీక దీపాలను వెలిగించారు. పట్టణంలోని పురాతన శివాలయంలో కొందరు మహిళలు కార్తీక దీపాలను ఓంకారం ఆకారంలో నందీశ్వర స్వామి మండపంవద్ద ఏర్పాటు చేశారు. అలాగే ఉత్సవమూర్తుల విగ్రహాల వద్ద ప్రత్యేకంగా శివలింగాలను అలంకరించారు.

ఆర్థిక స్థోమతలేని ఖైదీలకు ఉచితంగా న్యాయసాయం



ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతున్న జడ్జి లీలా వెంకటశేషాద్రి

నందికొట్కూరు: ఆర్థిక స్థోమత లేని ఖైదీలకు ఉచితంగా న్యాయవాదిని నియమించి న్యాయ సహాయం చేస్తామని జిల్లా న్యాయసేవా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి లీలా వెంకటశేషాద్రి స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని సబ్‌జైల్‌ను జడ్జి తనిఖీ చేశారు. ఖైదీలతో మాట్లాడిన జడ్జి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. ఖైదీల ఆరోగ్యం గురించి, ఆహార నాణ్యత గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక శక్తి లేక ఇబ్బందులు పడొద్దని, తమ దృష్టికి తీసుకొస్తే ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ జనార్దన్, ఎస్ఐ చంద్రశేఖర్, విజిటింగ్ న్యాయవాది అరుణ్‌కుమార్, పోలీసు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన తోటల సాగుతో రైతుల అభివృద్ధి



మునగతోటను పరిశీలిస్తున్న ఏపీడీ దాసు

కొత్తపల్లి: ఉద్యాన తోటలు సాగుచేసుకుంటే రైతులు అభివృద్ధి చెందుతారని ఏపీడీ దాసు అన్నారు. మండల పరిధిలోని ముసలిమడుగు రైతులు ఉపాధి హామీ పథకం క్రింద సాగుచేసుకున్న మునగ తోటలను శనివారం ఏపీడీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం నుంచి ఉద్యానతోటల సాగుకు అందించే ఆర్థిక సాహయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మునగ తోటలతో పాటు ఇతర పండ్లతోటలను కూడా సాగుచేసుకొనేందుకు రైతులు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ దేవదాసు, రైతులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు



సారా విక్రేత అరెస్టును చూపుతున్న సీఐ రామాంజనేయులునాయక్

నందికొట్కూరు: నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు నాయక్ హెచ్చరించారు. మండల పరిధిలోని కొణిదేల గ్రామంలో శుక్రవారం పోలీసులు దాడులు నిర్వహించారు. మోటార్ సైకిల్‌పై పది లీటర్ల నాటుసారాను తీసుకెళ్తున్న నీలిషికారి పవన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారీ, అమ్మకం నిషేధమని, ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ జఫ్రుల్లా, హెడ్ కానిస్టేబుల్ పద్మనాభం, శంకర్ నాయక్, కుమారి, పోలీసులు సుధీర్, శివన్న, మధుప్రసాద్, శ్వేతరాణి తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌కు బానిసలు కావొద్దు



విద్యార్థికి ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న హెచ్ఎం రఫీ అహమ్మద్

నందికొట్కూరు: సెల్‌ఫోన్‌కు విద్యార్థులు బానిసలు కావొద్దని వడ్డేమాన్ జెడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్ఎం రఫీ అహమ్మద్ సూచించారు. మండల పరిధిలోని వడ్డేమాన్ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో ప్రోత్సాహక బహుమతులను గణిత ఉపాధ్యాయుడు ఈశ్వరయ్యతో కలిసి హెచ్ఎం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ మహమ్మద్ హుసేన్, సభ్యులు స్వాములు, శివకుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

జూపాడుబంగ్లా: ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా క్రీడలశాఖ అధికారి రాజు తెలిపారు. మండల కేంద్రం జూపాడుబంగ్లా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఆ సమయంలో డాక్టర్ గంగాధర్ ఆసుపత్రిలో లేకపోవడంతో ఆరా తీశారు. వైద్యసిబ్బంది హాజరుపట్టికను పరిశీలించారు. ఎంత మంది సెలవుల్లో ఉన్నారంటూ సూపర్‌వైజర్ రాముడును అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ ఎక్కడ నివాసం ఉంటున్నారని ప్రశ్నించగా నందికొట్కూరులో ఉంటున్నారని వైద్యసిబ్బంది తెలిపారు. అనంతరం వచ్చిన డాక్టర్ గంగాధర్ ఎక్కడి వెళ్లారు సార్ అని ప్రత్యేకాధికారి రాజు ప్రశ్నించగా తంగడంచకు ఫీల్డ్ వెరిఫికేషన్ వెళ్లాలని తెలిపారు. మీరు సక్రమంగా విధులకు హాజరుకావడం లేదనే ఆరోపణలున్నాయని, జాగ్రత్తగా విధులు నిర్వర్తించకపోతే కలెక్టర్ ఉపేక్షించరని హెచ్చరించారు. పరికరాల్లేని కారణంగా ప్రసవాలు నిర్వహించడం లేదని డాక్టర్ గంగాధర్ తెలిపారు. కేజీ రోడ్డు నుంచి ఆసుపత్రి వరకు వీధి దీపాలు ఏర్పాటు చేయించాలని వైద్యసిబ్బంది కోరగా వెంటనే కార్యదర్శి తిప్పన్నను పిలిపించి వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మందుల గడువుతేదీలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ మొట్టిబాలయ్య, కార్యదర్శి తిప్పన్న, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.